



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -18-

. ఈ నిక్రుష్ట లోకం పై హృదయం ద్రవించి, ఎందరు మహనీయులు ఎన్ని మతాలు బోధించారో, ఎన్ని జ్ఞాన మార్గాలను విశదీకరించారో, ఎన్ని సాధనాలు ఉపదేశించారో..! ఎప్పుడూ కాంతి వైపు కన్ను తెరవాలని రెప్పలెత్తే ఈ అర్ధాంధులకోసం, ఈ ప్రజ కోసం.. ప్రవక్త తర్వాత ప్రవక్త, జ్ఞాని వెంట జ్ఞాని, అవతారం వెనుక అవతరం ఈ రొంపిలోకి దిగివచ్చి ఘోషించారూ, పాడారు. రుక్కుల్ని వినిపించారు. లాలించి, వెలుగును వెదజల్లారు. "దుఃఖితులారా రండి. మీ ఆర్తిని ఆర్పుతాము. దీనులారా కుంగిపోకండి. మీరు ధన్యులు. బీదలారా, సాధులారా రోదించకండి. స్వర్గ రాజ్యం మీది. గర్వానిధులారా! పరహింసా ఉన్మత్తులారా! ఐశ్వర్య పదవీ వ్యామోహ హృదయులారా! దైవమున్నాడని మరవకండి" అని, పర్వతాగ్రాల పురవీధుల, అరణ్యాశ్రయ పరిసరాల సహస్ర కంఠాలతో అరచిన ప్రవక్తలు ఏమైనారు? రక్తాన్నీ, సుఖాన్నీ, ప్రాణాన్నీ అర్పించి, కాలానికీ అధికారానికీ, ఎదురీదిన కరుణాత్ములు ఏమైనారు? అమర జ్ఞానాన్ని వేణువులో నుంచి, జగన్మోహన గానంగా వినిపించిన శ్రీ కృష్ణుడు, శాంతమైన దరహాసంతో దుఃఖాన్ని ఆర్పిన బుద్ధుడు, తన స్వంత రక్తంతో, ప్రజల పాపాన్ని పరిహారం చేస్తానని, బ్రతిమిలాడిన జీసస్, తల నరికి హృదయం లోకి తొంగి చూసిన మహ్మద్. వాళ్ళందరూ ఈనాడు

మతాలలో, కలహాలలో, కవిత్వాలలో, గొప్పతనాలలో ఉత్త పేర్లు. అహింసా స్థిమిత సుప్తుత్తులో, ద్వేషాన్ని ఆర్పజూసిన గాంధీ. అమృత గానంతో దుర్భేద్యకవాటాన్ని తట్టిన రవి. మౌనంతో జ్ఞానాన్ని పంచిన సాక్షాత్తూ దక్షిణా మూర్తి రమణ. వచ్చి పోయిన జాడన్నా కనిపించదు లోకంలో. "

ఈ కవితాత్మక వాక్యాలు చలంగారు అరుణాచలం వెళ్ళాక రాసిన "సుధా"అనే కవితా సంపుటి లోనివి. అంతకు ముందు ఆయన రాసిన రచనల నిండా సమాజంలోని కుహనా విలువల పట్లా, స్త్రీల, శిశువుల పట్లా సాగుతున్న అర్థంలేని దౌర్జన్యాల వల్లా, అనేకానేక అర్థంకాని, ఆచార వ్యవహారాల పట్లా, ఎలాగైతే తన అసహనాన్నీ, ఆక్రోశాన్నీ, అశాంతినీ వెలిబుచ్చారో ఈ 'సుధ'పుస్తకంలోని కవితల్లో కూడా చాలా వాటిల్లో అలాంటి అశాంతిని, ఆక్రోశాన్ని ప్రకటించారు చలంగారు. ఈ 'సుధ కావ్యం చలంగారి భావాలకే కాక, ఆ భాషా సౌందర్యానికి కూడా చక్కటి ఉదారణగా నిలుస్తుంది. ఇది ఇలా ఉంచి తరవాత కథనానికి వద్దాం...

చలంగారి మానవసేవా దృక్పథానికి మరికొన్ని ఉదాహరణలు చూద్దాం. కరుణా, దయా, అనేవి బెజవాడలో ఉండగా రక్షణ కేంద్రం నుండే ప్రారంభం అయినప్పటికీ, అరుణాచలం వచ్చేటప్పటికి అది పరాకాష్టకు చేరిందని చెప్పుకోవచ్చు.

" పతితులార, భ్రష్టులార,బాధా సర్పదష్టులారా! ఏడవకండేడవకండి!" అని శ్రీశ్రీ రాసినా,

"మనిషైతే, మనసుంటే, కనులు కరగాలిరా, కరగి, కరుణ కురియాలిరా! కురిసి జగతి నిండాలిరా" అని దేవులపల్లి రాసినా, అవి అక్షరాలకే పరిమితమయిన భావాలు. అయితే,వాటిని నిజ జీవితంలో పాటించి, ఆచరణాత్మకంగా నిరూపించిన కరుణాంతరంగ మూర్తి చలంగారు. ఇందుకు గొప్ప ఉదాహరణ ఇంతకు ముందు మనం తెలుసుకున్న తంబి వృత్తాంతం. అలాగే రమణ స్థాన్ లో చలం గారూ, వారి కుటుంబ సభ్యులూ ఆదరణలో సేదతీరిన జీవితాలూ, సాంత్వన పొందిన హృదయాలూ ఎన్నో... ఎన్నెన్నో... ఆ సేవాసదనంలో బాగుపడిన వ్యక్తులు ఎందరెందరో ... వాళ్ళందరూ చలంగారి భక్తులూ, అభిమానులూ అనుకోవడం కొంత వరకే నిజం. అసలు ఆయనంటే తెలియని వారు, పూర్తిగా అపరిచితులు, పైగా వ్యాధిగ్రస్తులు, ఇలాంటి వారిని కూడా అక్కున చేర్చుకుని ఆదుకున్నారు. ఈ కోణంలో రమణ స్థాన్ లో జరిగిన కొన్ని సంఘటనలు, చలంగారి కథలో ఉపకథలు అనదగిన వ్యక్తుల గురించి ఈ భాగంలో తెలుసుకుందాం.

చలంగారు అరుణాచలంలో వున్నప్పుడు "బోస్ కాంపౌడ్ "లోని ఒక ఇంట్లో ఉండేవారని గతంలో చెప్పుకున్నాం కదా! అది వూరికి చాలా దూరంగా ఉండేది. ఆ పరిసరాలకు, ఆ చుట్టు పక్కల ఊర్ల నుండి రకరకాల వ్యక్తులు వస్తుండేవారు. చలం గారి ఇంటికి వచ్చిన వాళ్ళు ఏ సహాయం అడిగినా, "లేదు, కాదు"

అనకుండా చేతనైన సహాయం చేస్తుండేవారు. అలాంటి ఒక సంఘటన  గురించి ఆ రోజుల్లో అక్కడ వున్న హనుమంతరెడ్డి గారు ఏం చెప్పారో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం...

"ఒకసారి  కళ్ళు కన్పించని ఓ అంధుడ్ని, అతని భార్యా, అన్నదమ్ములూ తీసుకువచ్చి, రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. అక్కడ "ద్రౌపది అమ్మాన్ "అని ఒక గుడి వుంది. ఇప్పటికీ ఉందనుకోండి. మేం వాకింగ్ కు అక్కడ దాకా వెళ్లి, కబుర్లు చెప్పుకునేవాళ్ళం. కొన్ని రోజులు 'షో' వంటల పుస్తకం డిక్టేట్ చేసేది అక్కడ కూర్చుని. కృష్ణారావుగారు రాసేవారు.  ఆ రోజు మేము అక్కడికి వెళ్ళినప్పుడు ఆ ముసలివాడు, గుడ్డివాడు భోరుమని ఏడుస్తున్నాడు. చలంగారు అతడ్ని చూసి, భరించలేకపోయారు. అక్కడ దగ్గర్లో ఎప్పుడో, ఎవరో కట్టిన మండపం ఉండేది. ఆ మండపంలో కూర్చోబెట్టి, స్నానం చేయించారు. ఆయన బట్టలు లుంగీలు అవీ తీసుకువచ్చి ఇచ్చారు. ఆ రోజు నుంచి అతను చనిపోయేంత వరకూ ప్రతిరోజూ పొద్దున్నా, సాయంత్రం వెళ్లి, భోజనం పెట్టి, నీళ్లు పోసేవారు. అతడికి కాళ్ళు లేకపోయినా అలాగే మేనేజ్ చేసుకునేవాడు. ఎక్కువగా లేవకుండా, పడిపోతాననే భయంతో, కూర్చునే ఒక చీపురుతో, మండపం శుభ్రంగా ఊడ్చుకోవడం, ఎక్కడ నీళ్ల పాత్ర పెట్టాడో గుర్తు పెట్టుకొని, మేం వెళ్ళగానే, ఆ చప్పుడుకి వచ్చి, తన గిన్నె తీసుకువచ్చి పెట్టేవాడు. తీసుకువెళ్లిన అన్నం, పప్పూ, కూరా అందులో పెట్టేసి వచ్చేసేవాళ్ళం. "ఎందుకు నాన్న గారూ! అతన్ని అలా వదిలేస్తే, ఒకసారి ఎండ్ అయిపోయేది కదా! చనిపోయేవాడు కదా!" అంటే "మన కళ్ళ ముందు కాకుండా ఎక్కడైనా జరిగిపోతే, జరిగిపోయేదేమో. నా కంటి ముందు కనిపించి, నేను అంతో, ఇంతో సహాయం చేయగలిగే స్థితిలో వున్నప్పుడు చెయ్యకుండా ఉండలేను. అది నా నేచర్"అని అన్నారు. ఆ వృద్ధుడు కొద్ది రోజుల్లోనే లేచి,నెమ్మదిగా నడవగలిగే వాడు.

ఆ 70 సంవత్సరాల వృద్ధుడ్ని దాదాపుగా 5సంవత్సరాలు, చలం గారూ, వారి కుటుంబ సభ్యులూ కంటికి రెప్పలాగా చూసుకున్నారు. చలం గారి ఇంట్లో 'అవ్వ' అని ఒకావిడ ఇంట్లో పనులకు సహాయం కోసం ఉండేది. ఆవిడ రెండు రోజులకు ఒకసారి వెళ్లి, ఆ మండపంలో వున్న వృద్ధుడికి స్నానం చేయించేది. ఆవిడే కాకుండా నర్తకి గారూ, కొన్ని కొన్ని సార్లు సౌరీస్ గారూ వెళ్లి అతన్ని చూసి, "బాగున్నారా?" అని యోగక్షేమాలు కనుక్కుండేవారు. అతను ఎప్పుడూ "ఏం బ్రతుకో, నాకు చావు వస్తే బాగుండును. ఇలా ఎన్ని రోజులు ఉండాలి ?" అని ఏడుస్తుంటే, వీళ్ళు వెళ్లి ఓదార్చుతుండేవారు. అలాగే అతనికి ఇబ్బంది లేకుండా ఉండాలనీ, నర్తకి ఒక బొంత కుట్టించింది.

చలంగారు పాత పంచెలూ, చొక్కాలూ అతనికి ఇస్తుండేవారు. చలికాలం, వర్షాకాలం అతను స్నానం చేయడానికి ఇబ్బందిగా ఉంటుందని వేడి నీళ్లు తీసుకొని వెళ్లే వాళ్ళు. చలంగారి ఇంట్లో మగవాళ్ళు ఉంటే,

వాళ్ళూ, లేకపోతే నర్తకి గారే వెళ్లి జాగ్రత్తగా చూసుకుంటూ ఉండేవారు." ఇది చలం గారు రమణ స్థాన్ లో ఉండగా మానవత్వపు కోణానికి ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. అలాంటిదే మరొకటి చూద్దాం.

ప్రతిరోజూ రమణస్దాన్ లో ఒక వంద మంది దాకా భోజనం చేసేవారు అనుకున్నాం కదా! వీళ్లంతా అతిధులూ, అభ్యాగతులూ. వీళ్ళే కాకుండా చలం గారు ప్రత్యేకించి అంబలి కాసి, దారిన వెళ్ళే భిక్షగాళ్ళకీ, సాధువులకు పోస్తుండేవారు. సాధారణంగా వీళ్ళు సంచార జీవనం కాబట్టి, ఒకరోజు వచ్చిన వాళ్ళు, మరోసారి వచ్చేవారు కాదు. ఒకసారి ఏమైందంటే... ఒక వృద్ధుడు ప్రతిరోజూ అంబలి కోసం వచ్చేవాడు. అతనికి దాదాపుగా 60 సంవత్సరాల వయసు ఉంటుంది. అంబలి తాగి వెళ్లకుండా, చలం గారి ఇంటి దగ్గర ఒక వేపచెట్టు ఉంటే, అక్కడ కూర్చునేవాడు. కొన్ని రోజుల తర్వాత ఇతను రోజూ వస్తున్నాడని వీళ్ళు గమనించారు. అతన్ని నెమ్మదిగా అడిగారు "ఏమిటి నీ పరిస్థితి?"అని. అంటే, అతను చెప్పాడు.

" ఒకప్పుడు బాగా బ్రతికిన వాడిని. నా పేరు రంగ స్వామి. నాకు కుష్టువ్యాధి వచ్చింది. అందుకని నా కుటుంబ సభ్యులు నన్ను ఇంట్లో నుండి తరిమేశారు. వేరే గతి లేక ఈ తిరువణ్ణామలైలో తిరుగుతూ, మీరు అంబలి పోస్తున్నారని తెలిసి, ఇక్కడకు వస్తున్నాను "అన్నాడు. ఆ వేపచెట్టు దగ్గరే ఉండేవాడు. రాత్రుళ్ళు కూడా అక్కడే పడుకునేవాడు.

కేవలం అంబలి పొయ్యడమే కాకుండా, కొన్ని రోజులకి చలం గారి ఇంట్లో వండుకున్న భోజనం కూడా అతనికి పెడుతుండేవారు. అతనికి ఒంట్లో పూళ్ళూ, వాటినుండి రాసి కారడం ఇలాంటివి వున్నపుడు నర్తకి వెళ్లి, ఏ మాత్రం సందేహించకుండా, ఆ పుళ్ళు తుడిచి, యేవో మందులు అవీ రాసి వస్తుండేవారు. సాధారణంగా కుష్ఠ వ్యాధి అంటే, అంటు వ్యాధి అని ఎవరూ దగ్గరకు వెళ్లేవారు కాదు. అలాంటి స్థితిలో కూడా నర్తకి అతనికి సేవ చేస్తూ ఉండేది. అతను రోజంతా అక్కడే ఉండటం, అనధికారంగా చలం గారికీ, రమణ స్థాన్ కీ రక్షకుడిగా లాగ ఉండేవాడు. ఎవరైనా ఆ కాంపౌండ్ లోకి వచ్చి, పూలు కోసుకోవడం, ఇలాంటివి చేస్తుంటే, అదిలించడం, అలాగే సాయంత్రం పూట అందర్నీ భజనలకి పిలుచుకురావడం ఇలాంటి పనులు చేస్తుండేవాడు. అతనికి ఏమైనా శరీరం సహకరించినపుడు ఊర్లోకి వెళ్లి, కూలి పనులు చేస్తుండేవాడు.

చలంగారి తోటి సాన్నిహిత్యం పెరిగాక అడిగాడు "నాకు పూర్వాశ్రమం లో పశువుల్ని పోషించిన అనుభవం వుంది. మీరేమైనా ఆవుని కొనిపెడితే గనక, నేను చూసి పెడతాను. "అన్నాడు. అతని అభ్యర్ధన మేరకు, అతనికి కూడా కొంచెం సహాయకారిగా ఉంటుందని చెప్పి, అప్పటి వరకూ లేని ఆవుని కొన్నారు. ఆ ఆవుని ఆ రంగస్వామే చూసుకునేవాడు. బయటకు తీసుకువెళ్లడం, దాని తాలుకా పనులన్నీ చేసేవాడు. దాదాపు ఇంటి బయట ఉన్నప్పటికీ, ఇంటి సభ్యుడిగానే ఉండేవాడు. కొన్ని రోజుల తర్వాత అతనికి చెప్పారు "చెంగల్పట్టు దగ్గర కుష్ఠ వ్యాధి

నయం చేసే ఆశ్రమంలేదా పునరావాస కేంద్రం వుంది"అని చెప్పి అక్కడకు పంపించారు. అక్కడకు వెళ్లి అతని వ్యాధి నయం అయ్యి, తిరిగి వచ్చాడు. తిరిగి వచ్చాక కూడా చలం గారి ఇంట్లో సహాయకుడిగా ఉండేవాడు. అక్కడే ఎక్కడో చిన్న గుడిసె వేసుకొని చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ, ఇంట్లో కూడా సహాయంగా ఉండేవాడు. ఇదంతా చలంగారూ, అతని కుటుంబ సభ్యులూ కూడా చూపించిన ఆదరణా, వాళ్ళు చేసిన సహాయం. అలా కొద్ది సంవత్సరాలు అయ్యాక, అతనికి స్ఫోటకం వచ్చి, దాదాపు చిట్టచివరి దశలో వున్నప్పుడు కూడా, నర్తకి ఆ గుడిసెకు వెళ్లి, అతనికి సేవ చేసి, అతను కన్ను మూసేవరకూ కూడా జాగ్రత్తగా చూసుకున్నారు. ఇలాంటివి కనీసం ఊహకి కూడా అందవు మనకి. ఆ రోజుల్లో చలంగారు ఉన్న పరిస్థితుల్లో ఇలా ముక్కూ, మొహం తెలియని మనుషులను కూడా జాగ్రత్తగా చూసుకోవడం అనేది ఒక కోణం. చాలా మంది చలం గారి గురించి మాట్లాడుకునేటప్పుడు ఎక్కువగా చర్చించనటువంటి కోణం ఇదంతా. ఇలాంటివి ఈ రెండు మాత్రమే కాదు. కొన్ని డజన్ల కొద్ది వున్నాయి. మరొక రెండు సందర్భాలు గురించి చెప్పుకుందాం.

భగవాన్ రమణ మహర్షి జీవించి వున్న రోజుల్లోనే, విదేశాల నుండి చాలా మంది వచ్చి, అక్కడ స్థిర పడిపోయి, ఉండేవారు. అక్కడ ఇల్లు కట్టుకొని రమణ మహర్షి సాన్నిధ్యంలో ఉండేవారు. అలాంటి వాళ్లలో ఒక యూరప్ దేశస్థుడు "చాడ్విక్". అతను ఆ రమణ మహర్షి దగ్గర దాదాపు 20 సంవత్సరాలుగా వున్నాడు. చలంగారు రమణస్థాన్ లో స్థిరపడ్డాక, వాళ్లకి కూడా పరిచయం అయ్యాడు. అయితే, భగవాన్ కన్ను మూశాక, ఆశ్రమంలో జరిగిన పరిణామాలు, ఇవన్నీ చూడలేక అతను ఆ వూరు వదిలేసి, హిమాలయాలకు వెళ్ళిపోయి, ఒక సంవత్సరం తర్వాత మళ్ళీ వచ్చాడు. తిరిగి వచ్చేసరికి ఆశ్రమం లోని పరిస్థితులు కొంచెం కొంచెంగా చక్క దిద్దుకుంటున్నాయి.

అప్పుడు చలం గారి ఇంట్లో సౌరీస్ గారికి ఈశ్వర దర్శనం అయి, సాయంకాలం పూట భజనలు జరుగుతుండేవి. ఆ క్రమంలో చాడ్విక్ రోజూ వచ్చి, భజనల్లో కూర్చుండేవాడు. ఎందుకంటే, అప్పటికే రమణ మహర్షి లేడు కాబట్టి. అలా వచ్చి కూర్చోవడమే కాకుండా, అక్కడకు దగ్గర్లోనే ఒక ఇల్లు కట్టుకొని, ఆ ఇంట్లోనే ఉండేవాడు.

కొద్ది రోజుల తర్వాత అతనికి వంట మనిషి వెళ్ళిపోతే, చలం గారి ఇంటి నుండి భోజనం వెళుతుండేది. ఆ చాడ్విక్ ఆశ్రమ పరిస్థితులు చక్కదిద్దాలని, తనకు చాతనయినంతలో ఎక్కడో విదేశాలకి రాసి, తెలిసిన వాళ్ళని అడిగి, నిధులు తెప్పించి, ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావడానికి శాయశక్తులా కృషి చేశాడు. కొన్ని దశాబ్దాలుగా అక్కడ వున్నాడు కాబట్టి, అతనికి అప్పటికే వేదాలు చదవడం అలవాటయ్యింది. రమణ మహర్షి జీవించి వున్న రోజుల్లోనే అతని చుట్టూరా, వేదాలు చదివే పిల్లలు ఉండేవారట. ఆ సాంప్రదాయాన్ని మళ్ళీ కొనసాగించడానికని చెప్పి, రమణ మహర్షిని సందర్శించడానికి వచ్చిన వాళ్లలో కొంత మందిని బ్రతిమిలాడి, వాళ్ళ పిల్లల్ని తీసుకురమ్మనమని చెప్పి, పిల్లలకు వేదాలు నేర్పించే కార్యక్రమం చేపట్టాడు చాడ్విక్.

అంతే కాకుండా, వాళ్లకి మామూలు విద్య కూడా కావాలని, చలం గారి దగ్గర ఉన్న బసవరాజు అనే అతన్ని తీసుకువెళ్లి, వాళ్లకి ఇంగ్లీష్ కూడా చెప్పించాడు. ఇంత సేవా కార్యక్రమాలు ఆ రమణ మహర్షి ఆశ్రమంలో చేస్తున్నప్పటికీ, అతడు చలం గారి దగ్గరకు రావడం, చలం గారి ఇంటి నుండి వెళ్లడం జరిగేవి. ఇలా చలం గారి కుటుంబానికి దగ్గరయ్యాడు. కొద్ది సంవత్సరాలకు ఆయనకు వృద్ధాప్యం వచ్చేసింది. జాండిస్ కూడా వచ్చింది. అప్పుడు నర్తకి వెళ్లి అతనికి సేవలు చేసేది. చివరకు ఆయనను వేలూరు హాస్పిటల్ లో చేర్పించారు. ఆ వేలూరు హాస్పిటల్ లోనే కన్నుమూశారు. ఆయన  అంతిమ సంస్కారాలు నిర్వహించడంలో కూడా చలం గారూ, ఆయన కుటుంబ సభ్యులు ప్రముఖ పాత్ర పోషించారు. చాడ్విక్ ఏమవుతాడు? ఏమీ కాదు. అలాంటిదే మరొక ఉదాహరణ.

ఈ చాడ్విక్ అనే విదేశస్తుడు రమణ మహర్షి ఆశ్రమం లో వున్న రోజుల్లోనే, అంతకు ముందు నుండి కూడా "మెర్సటన్" అని ఒకావిడ యూరప్ దేశాల నుండి వచ్చింది. ఆమె 1940 ప్రాంతాల నుండి భగవాన్ రమణ మహర్షి దగ్గర ఉంటోంది. చలం గారి భార్య రంగనాయకమ్మ గారు మొదటిసారి అరుణా చలం వెళ్ళినపుడు, అక్కడ పరిచయం అయింది ఈ మెర్సటన్ . అప్పటి నుండి కూడా వీళ్లకు తెలుసు. చాడ్విక్, ఈ మెర్సటన్ ఇద్దరూ సమకాలికులే. ఈ మెర్సటన్, చలం గారు ఉన్నటు వంటి ఇంటికి దగ్గర్లోనే ఒక ఇల్లు కట్టుకొని ఉంటోంది. ఆవిడకు దాదాపు 80 సంవత్సరాల వయసులో కూడా ఇల్లు కట్టుకునేటప్పుడు, తను సొంతంగా రాళ్లు మోసేది. ఆవిడకు అప్పటికి గత 20 సంవత్సరాలుగా కేన్సర్ వుంది. ఆ విషయం కూడా ఎవరికీ చెప్పలేదు. ఆమె కేన్సర్ తో బాధ పడుతున్నప్పుడు, వంట చేసుకో లేకపోతే, చలం గారి ఇంటి నుండే భోజనం వెళుతుండేది.

అంతే కాకుండా ఆమెకు సహాయం చేయడానికి అందరూ భయపడేవారు. ఆ కేన్సర్ ఎంత భయంకరంగా ఉండేదంటే, ఒక్కోసారి ఒంట్లో నుండి మాంసపు ముద్దలు ఊడి వచ్చేటట్లు ఉండేవట. అలాంటి భయంకరమైన వ్యాధితో బాధ పడుతున్నప్పుడు కూడా నర్తకి వెళ్లి, ఆ ఒంటి నంతటినీ శుభ్రం చేసి, ఆవిడకు ఏ మందులు కావాలో ఇచ్చి, దగ్గరుండి ఏవో కొన్ని జాగ్రత్తలు చెప్పి, ఎప్పటి కప్పుడు వెళ్లి వస్తుండేది. ఆమెకు చిట్ట చివరి రోజులు వస్తున్నాయని తెలిసి నపుడు, నర్తకి పిలిచి, తన దగ్గర ఉన్న వస్తువులు ఎవరెవరికి ఎలా పంపించాలి. ఐరోపా దేశాలకి ఎలా పంపించాలి. మద్రాస్ లో వున్న మిత్రులకు ఎలా చేర్చాలి. అన్నీ కూడా ఒక జాబితా రాసింది ఆ వృద్ధ మహిళ  మెర్సటన్. చివరికి ఆమె చనిపోయినపుడు శరీరం అంతా కూడా విపరీతమైన దుర్గంధం వస్తుంటే, ఎవరూ కూడా ఆ ఇంటి వైపు వెళ్ళడానికే భయపడ్డారు. అలాంటి పరిస్థితిలో నర్తకి వెళ్లి, ఆ మృతదేహాన్ని శుభ్రం చేసి, అలంకరించి, దహన సంస్కారాలు నిర్వహించారు.

ఒక్కసారి చూడండి. ఎవరు ఆ మండపం లోని వృద్ధుడు? ఎవరు కుష్ఠు వ్యాధితో బాధపడే చాడ్విక్?ఎవరు ఈ మెర్సటన్? ఎవరు వీళ్లంతా?బంధువులా? అభిమానులా?సాహితీ ప్రియులా?ఎవరూ కాదు. సాటి

మానవులు అంతే. సాటి మానవుల మీద అనంతమైన మానవత్వాన్ని కురిపించిన నర్తకి. ఆవిడ త్యాగనిరతి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. నర్తకి, చలంగారికి పూర్తి కాలం సహాయకురాలిగా ఉండడమే కాకుండా, వీళ్ళందరికీ సహాయ పడ్డారు. ఎప్పుడైనా, ఎక్కడైనా – చలంగారి సంబంధించిన వ్యాసాల్లోగానీ, విమర్శనా గ్రంథాల్లో గానీ, చలంగారి గురించిన పరిశోధనా గ్రంథాల్లో గానీ, చలంగారి కుటుంబ సభ్యులు చేసిన, ఈ మానవత్వపు సేవ గురించి ఎక్కువగా ప్రస్తావించబడదు. అందుకని మీ దృష్టికి ఇవి తీసుకు వద్దామని ఈ విషయాలు ప్రస్తావించడం జరిగింది.

ఇవే కాకుండా చలంగారు రమణస్థాన్ లో ఉండగా, ఆయనకు ఏ మాత్రం సంబంధం లేనివాళ్ళూ ఎంత మందో సహాయం పొందిన వాళ్ళు వున్నారు. కొన్ని సార్లు చలంగారు బలవంతంగా కొంత మందిని ఆదరించాల్సి వచ్చింది. అయినా సరే! వాళ్లెవరు?ఎక్కడ నుండి వచ్చారు? మనకేమిటి?అనే ప్రశ్న లేకుండా "ఎంత వరకు సహాయం చేయగలము"అని ఆలోచించి, ఆ దిశగా సహాయం చేస్తుండేవారు. మరొక ఉదాహరణ.

విశాఖపట్నం లో డా:వసుంధర అని ఒక డాక్టర్ గారు వున్నారు. ఆమె మరొక డాక్టర్ గారిని వివాహం చేసుకోవడానికని చలంగారి దగ్గరకు వచ్చి చెప్పారు "నేను మరొక డాక్టర్ ని వివాహం చేసుకుందామని అనుకుంటున్నాను. ఆ వివాహం మీ ఆశ్రమం లోనే జరిగితే బాగుంటుంది."అన్నారు. అలాంటి పెళ్లిళ్లు చలంగారి ఆశ్రమంలో అర డజను జరిగాయి. అలా చలంగారిని అడిగి, వాళ్ళ ఇంటి ముందే పందిరి వేసి, ఆ పందిట్లో పెళ్లి చేసుకున్నారు ఆ వసుంధరా, రావు గారు.

అయితే మనం చెప్పుకోబోయేది వీళ్ళ గురించి కాదు. వీళ్ళ ద్వారా ప్రారంభమయిన మరో కథ గురించి, ఈ డా:వసుంధర, డా:రావు గారు ఎవరంటే, వాళ్ళ అమ్మాయి తెలుగు కథానాయక గౌతమి. ఇటీవల ఆమె కే న్సర్ నుండి బయటకు వచ్చి, చాలా స్ఫూర్తి దాయకమైన వ్యక్తిగా నిలబడ్డారు. వాళ్ళ వివాహం అయిపోయాక, విశాఖపట్నం వెళ్లిపోయారు. అక్కడ ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. ఒకసారి వసుంధర గారి క్లినిక్ కి ఒక 15,16, సంవత్సరాల అమ్మాయి వచ్చింది. ఆ అమ్మాయి బర్మా కాందిశీకురాలు. ఆ రోజుల్లో బర్మా లో జరుగుతున్న రాజకీయ పరిస్థితుల వల్ల, అక్కడ వుండే తెలుగు వాళ్ళు, ఆంధ్ర దేశంలో రకరకాల ప్రదేశాలకు వలస వచ్చారు. "వాళ్ళను బర్మా కాందిశీకులు "అనే వారు. ఈ 15,16, సంవత్సరాల అమ్మాయి పేరు "శోభ". తెలుగమ్మాయి. కానీ, తెలుగు, బర్మా యాస తోటి మాట్లాడుతుంది. ఎలాగో విశాఖపట్నం వచ్చి, ఈ డా:వసుంధర గారి క్లినిక్ కి వచ్చింది. వచ్చిన తరవాత తన అనారోగ్యం తగ్గిపోయిన తర్వాత, అడిగింది

"నాకు ఏదైనా పని ఉంటే, చూపించండి. నాకు ఏమీ గత్యంతరం లేదు." అంది. అప్పుడు వసుంధర గారు విశాఖపట్నం లో ఒకటి, రెండు చోట్ల వుద్యోగం ఇప్పించాలని ప్రయత్నించారు. ఎక్కడా కుదరక, చలంగారి ఆశ్రమానికి తీసుకువచ్చారు. "చలం గారి దగ్గరకు తీసుకువెళుతున్నాం" అని శోభకు చెప్పారు. అక్కడకు

వెళ్ళగానే, “చలం ఏమిటి ఇంత ముసలిగా వున్నాడు? సినిమాల్లో వేస్తాడు కదా!”అంది. ఆ అమ్మాయికి తెలిసిన చలం, సినిమా యాక్టర్ చలం. ఆ అమ్మాయి తెలుగు సరిగ్గా రాదు. కొంచెం కొంచెం వచ్చు. అక్కడ పద్ధతుల గురించి వసుంధర గారు నచ్చజెప్పారు. “అయితే, సినిమా వాళ్ళందరూ ఇలాగే వుంటారా?” అనుకుంది. 2,3 రోజులకు అర్ధమయ్యింది. ఇతను సినిమా యాక్టర్ చలం కాదు. ఈయన పెద్దాయన, అవసరం అయితే, ఎవరికైనా సహాయాలు చేస్తుంటాడు అని. కొద్ది రోజులకే ఆశ్రమం యొక్క పరిస్థితులకు అలవాటు పడింది. ఈవిడను వదిలేసిన డాక్టర్ల దంపతులు వెనక్కి వెళ్లిపోయారు.

ఈ అమ్మాయిని ఎక్కడైనా పనిలో పెడదాము అని ఆలోచిస్తున్న రోజుల్లో, ఆ ఆశ్రమానికి వచ్చే ఒక కుర్రాడు “నాన్న గారూ! ఈ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను”అన్నాడు. అప్పుడు ఆ కుర్రవాడికీ, ఈ శోభకీ వాళ్ళ ఇంటి ముందే పెళ్లి చేశారు. పెళ్లయిన తర్వాత ఆ కుర్రవాడు, శోభని విజయవాడ దగ్గర ఏదో వాళ్ళ సొంత వూరు తీసుకువెళ్లాడు. అక్కడకు వెళ్ళిపోయి, కాపరం చేసుకుంటున్నారు. ఏమైందో, ఏమిటో గానీ, ఒక సంవత్సరం మించి వాళ్ళ కాపరం సవ్యంగా సాగలేదు. ఆ అమ్మాయిని తీసుకువచ్చి, తిరుపతి దగ్గర ఎక్కడో వదిలేసి వెళ్ళిపోయాడు. అక్కడ నుండి ఎక్కడకు వెళుతుంది? తెలుగు కూడా సరిగ్గా రాదు. తనకు తెలిసిన అరుణా చలం వచ్చేసింది. చలం గారు మళ్ళీ కాదనకుండా ఆమెను తన ఇంట్లో ఉంచుకున్నారు. అక్కడ కార్యక్రమాల్లో పాల్గొనేది. వంటా, ఇంటి పనులు చేసేది.

కొన్ని రోజుల తరువాత బర్మా నుండి వాళ్ళకు సంబంధించిన వాళ్లెవరో కబురు చేశారు. వాళ్ళతో వెళ్ళిపోయింది. ఇక్కడ వున్నన్ని రోజులూ చదువు కూడా చెప్పించారు. అలా ఆ శోభని ఒక పరిచయం లేనటువంటి, అపరిచతురాలిని 2,3 సంవత్సరాల పాటు, చలం గారు తన ఆశ్రమం లో ఆశ్రయం ఇచ్చి ఆదుకున్న వైనం. అయితే ఆమె బర్మా వెళ్ళిపోయాక, ఈ మధ్యనే అంటే 2018 ప్రాంతాల్లో, బర్మా నుండి తన పిల్లల్ని తీసుకొచ్చి, తను రమణ స్థాన్ లో ఉన్నటువంటి ఆ పరిసరాలు అన్ని చూపించింది. చలంగారి ఇంట్లో ఎవరెవరో వచ్చి ఆశ్రయం పొందుతున్నారు అనడానికి ఇదొక ఉదాహరణ. కొన్ని సార్లు చలం గారు వద్దనుకున్నా గానీ, ఖచ్చితంగా వచ్చి, ఆయన మీద పడుతుండేవి. అలాంటి కథ ఒకటి చూద్దాం. దీన్ని చలం గారు ఆత్మకథ లో కూడా రాసుకున్నారు.

మంగారాం అనేటటు వంటి వ్యక్తి ఉత్తర భారత దేశస్థుడు. తెలుగు సరిగ్గా రాదు. రమణ మహర్షి ఉండగా, ఆయన మీద భక్తి తో అక్కడకు దగ్గర్లో ఒక ఇల్లు తీసుకొని ఉంటున్నాడు. అప్పుడప్పుడు చలం గారి దగ్గరకు వస్తుండేవాడు. సహజంగానే రమణ మహర్షి నిర్యాణం తర్వాత, భక్తులలో కొంతమంది చలం గారి దగ్గరకు వచ్చేవారు. చాలామంది వచ్చేవారు కాదు. అలా చలంగారికి పరిచయం అయ్యాడు ఈ మంగారాం. ఒక రోజు చలంగారి దగ్గరకు వచ్చి “బ్రదర్! మై డాటర్ ఈజ్ ప్రెగ్నెంట్. ఏం చేసిందో చూడండి” అని చెప్పాడు.

“మీ కూతురు గర్భవతి అయితే ఎందుకు భయపడడం. 8 నెలలు ఆగితే కొడుకో, కూతురో పుడతారు కదా!”అన్నారు చలం గారు.

“అలా కాదు. మా అమ్మాయి ఇక్కడ లేదు. వాళ్ళ ఊరైన బొంబాయి లోనో, కలకత్తా లోనో వుంది. మా అమ్మాయికి ఇంకా వివాహం కాలేదు. వివాహం కాకుండా గర్భవతి అయింది. అందుకని ఇక్కడకు తీసుకువస్తున్నాను. ఇక్కడకు తీసుకువచ్చిన తర్వాత భక్తులు ఏం గొడవ చేస్తారో తెలీదు. మీ ఇంట్లో వుంచుకుంటారా?” అని ఆ తరవాత అసలు విషయం చెప్పాడు. “మా అమ్మాయికి 17, 18 సంవత్సరాల వయసు ఉంటుంది గానీ, మానసికంగా ఎదగలేదు. శారీరకంగా పెద్దగా కనిపిస్తుంది. గానీ, ఆమె ఆలోచనలూ, చేసేపనులూ 8,9 సంవత్సరాల అమ్మాయి లాగ ఉంటుంది.“ ఈ విషయం చలం గారితో చెబితే ” సరే! అలాగే తీసుకురా! ఉంచుదాం లే! “అన్నారు. దేనికీ కూడా “లేదు, కాదు” అనే సమాధానం ఉండేది కాదు.

ఆ అమ్మాయిని తీసుకువచ్చారు. ఎవరికీ తెలియకుండా చలంగారి ఇంట్లో ఉంచారు. అయితే, రమణ మహర్షి ఆశ్రమంలో వున్న వాళ్లకి “పెళ్లి కాకుండా గర్భవతి అయిన అమ్మాయి వుంది” అని ఎలాగో తెలిసిపోయింది. “చాలా మంది వచ్చి వెళుతుంటారు. ఎవరికీ తెలియదు లే.” అనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్నటువంటి “తెలుగు మహిళా మణులు” చలంగారిని “ఏమిటీ? మీ ఇంట్లో పెళ్లికాని అమ్మాయి ఉందట. ఆమె గర్భవతి అట. ఎందుకు మీ ఇంట్లో ఉంచుకున్నారు?”అని గట్టిగా అడగడం ప్రారంభించారు. “సరే! మీరే ఆ అమ్మాయిని అడగండి.”అని “సావిత్రీ! అని పిలిచారు. ఆ అమ్మాయి పేరు సావిత్రి. వచ్చింది. వచ్చిన వాళ్ళు ఏవో ప్రశ్నలు వేశారు. ఆ అమ్మాయికి హిందీ తప్ప, మరో భాష రాదు. తెలుగు అస్సలు రాదు. దాంతో ఆ అమ్మాయి తెలిసీ, తెలియని సమాధానాలు చెప్పడం ప్రారంభించింది.

ఇక చలం గారిని ప్రశ్నించినా గానీ, ఏమీ సమాధానం రాదని వాళ్లకు తెలుసు. అందుకని వాళ్ళకే విసుగెత్తి వెళ్లిపోయారు. మొత్తానికి ఆ అమ్మాయి చలం గారి ఇంట్లోనే వుంది. మళ్ళీ కొన్ని రోజులకు మంగారాం వచ్చి, “వీళ్లెవరికీ తెలియదనుకున్నాను. కానీ, అందరికీ తెలిసిపోయింది. కొన్ని రోజుల తర్వాతైనా గొడవ చేస్తారేమో. మా అమ్మాయిని ఎక్కడికైనా పంపించి, ప్రసవం అయ్యేటట్లు మీరే చూడండి. “ అన్నాడు. ఏదో కావాలంటే, ఇంట్లో ఉంచుకున్నారు గానీ, ఇలాంటివి వస్తాయని ఊహించలేదు. ఆ రోజుల్లోనే చలం గారికి డా:కామేశ్వరి అని ఒకామె విశాఖపట్నం నుండి ఉత్తరాలు రాస్తూండేవారు. ఆమెకి వుత్తరం రాసారు “ఒక అమ్మాయి వుంది. సహాయం చెయ్యాలి. ఇదీ పరిస్థితి.ఆ అమ్మాయికి ప్రసవం అయ్యేవరకూ మీ హాస్పిటల్ లో ఉంచుకొని చూడండి. “ అని రాశారు . “సరే! పంపించండి నాన్న గారూ!”అని ఆమె జవాబు రాశారు.

మంగారాం కి చెప్పారు “ఇలా పంపిస్తాను”అని. ఇంతలో అతను “నేను కూడా మా అమ్మాయితో వెళ్తాను” అన్నాడు.

“మీ అమ్మాయి ఒక్కర్తే అయితే, చూసుకోగలరు. మరి నువ్వు కూడా వెళ్తే, మీ ఇద్దరికీ ఖర్చులు ఎక్కడ నుండి వస్తాయి? “అన్నారు.

“లేదు. నా దగ్గర వున్నాయి. నేను ఇక్కడ వడ్డీ వ్యాపారం చేస్తున్నాను. డబ్బులు వున్నాయి. ”

మళ్ళీ కామేశ్వరిగారికి రాసి, ఒప్పుకున్నాక, వాళ్ళిద్దరినీ విశాఖపట్నం వెళ్ళడానికి ఏర్పాట్లు అన్ని చేశారు. ఒక బండి తెచ్చి, తాను వుంటున్నటు వంటి ఇంటికి తాళం వేసి, రైల్వే స్టేషన్ కి వెళ్ళాడు. సరే! విశాఖపట్నం వెళతాడు. కబురు వస్తుంది. అనుకున్నారు చలం గారు. కానీ, ఒక 5,6 గంటల్లో బండి వెనక్కి వచ్చేసింది. “ఏమిటయ్యా మంగారాం వెనక్కి వచ్చేసావు. “ అంటే,

“నాకు ఎందుకో వెళ్ళ బుద్ధి కాలేదు. అందుకే వచ్చేసాను. “ అనడమే కాకుండా, చలంగారి ఇంటి దగ్గర బండి ఆపి, “బండి డబ్బులు మీరే ఇవ్వండి.”అన్నాడు. అప్పటికే ఈ మంగారాం కి మతి స్థిమితం తప్పుతోంది అని చలం గారు గ్రహించారు. అప్పటికి ఏదో పంపించేశారు. మళ్ళీ ఆ అమ్మాయి చలం గారి ఇంట్లోనే వుంది.

కొన్నాళ్ళకి ఆ అమ్మాయికి ప్రసవం అయ్యింది. ఒక ఆడబిడ్డ పుట్టింది. అన్ని రోజులూ కూడా ఆ మంగారాం, చలం గారి ఇంటికి వచ్చి, “మా అమ్మాయికి అన్నం పెడుతున్నారు. నాక్కూడా పెట్టండి. నాకు సిగరెట్లకు డబ్బులు ఇవ్వండి. “ ఇలా అడిగేవాడు. అప్పటికి ఆయనకు మతి స్థిమితం తారా స్థాయికి వెళుతోంది. “ఆ స్థిమితం తప్పి, కొంచెం పిచ్చివాడుగా కూడా ప్రవర్తిస్తున్నాడు” అనుకున్నారు. ఆ అమ్మాయి ప్రసవించి, ఆడబిడ్డ పుట్టాక, ఆ బిడ్డను ఎక్కడ పెంచుతాడు? ఎవరు చూస్తారు? అక్కడ ఎవరో పిల్లల కోసం చూస్తుంటే, నర్తకే ఆ పాపని వేరేవాళ్లకి ఇచ్చేసింది.

అది తెలిసిన మంగారాం గొడవ చెయ్యడం ప్రారంభించాడు. “మా మనవరాల్ని ఎక్కడో అమ్మేశారు. తీసుకురండి.“ అన్నాడు. “తీసుకువస్తాం గానీ, నువ్వు ఏం చేస్తావు?ఎలా పోషిస్తావు? “అంటే, సమాధానం లేదు. అతనికి మతి భ్రమించడం అనేది, ఎక్కువ స్థాయికి చేరి, ఒక రోజు తన ఇంట్లో కూర్చొని, తలుపులు వేసుకొని, “నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను “అని అరవడం ప్రారంభించాడు. దాంతోటి చలం గారూ, వాళ్ళు పోలీసు రిపోర్ట్ ఇస్తే, పోలీసులు వచ్చి, తలుపులు బద్దలు గొట్టి, మంగారాంను బయటకు తీశారు. అక్కడ నుండి మద్రాస్ తీసుకువెళ్లి, అక్కడ మానసిక వికలాంగుల యొక్క ఆసుపత్రిలో చేర్పించారు. మంగారాం కూతురు సావిత్రి మాత్రం ఆ ఇంట్లోనే వుంది.

మంగారాం, సావిత్రీల గురించి వాళ్ళ బంధువులకు వుత్తరం రాస్తూ, “మంగారాం నోట్లూ, ఆ వడ్డీలూ అవీ మీరే వసూలు చేసుకోండి. “అని రాసారు. మంగారాం బంధువులు వచ్చారు. ఆ డబ్బులు వసూలు చేసుకొని, ఆ పిల్లను తీసుకొని వాళ్ళ వూరు వెళ్లిపోయారు. అలా 5,6 నెలలు గడిచాయి. మంగారాం ఆసుపత్రి లోనే వున్నాడు. కొన్ని రోజులకి ఆసుపత్రి వాళ్ళు వుత్తరం రాసారు “ఇతనికి కొంచెం తగ్గుతోంది. మళ్ళీ మామూలు మనిషవుతున్నాడు. పంపించేస్తాం. మీ దగ్గరకే పంపించ మంటారా?”అని రాసారు. ఎందుకంటే, జాయిన్ చేసింది చలం గారే కదా!

“సరే!”అన్నారు. అతనికి కాస్త మతి స్థిమితం కుదిరాక, వెనక్కి వచ్చాడు. వచ్చాక అప్పుడు జరిగినటువంటి సంభాషణ, చలం గారి మాటల్లోనే...”త్వరలోనే మంగారాం కూడా దిగాడు. చాలా జాలిగా “నన్నెందుకు పిచ్చాసుపత్రిలో జాయిన్ చేసావు వెంకటాచలం?”. ఏమీ జవాబు చెప్పలేక సిగ్గుతో తలవంచుకున్నాను. అతనికిప్పుడు ఇల్లు లేదు. డబ్బు లేదు. డబ్బు లేకపోవడంతో, స్నేహితులంతా మొహాలు దాచేసారు. కూతురు కూడా లేదు. అతన్ని నేను ఎందుకు బ్రతికించినట్టు. నేను చేసింది పుణ్య కార్యమా?పాప కార్యమా? త్వరలోనే అతను ఏమీ తోచక చచ్చిపోయాడు. “

మంగారాం యొక్క జీవితం అలా ముగిసి వుండవచ్చు గానీ, చలం గారూ, అతని కుటుంబ సభ్యులూ కాపాడినటు వంటి ఆ అమ్మాయి సావిత్రీ, వాళ్ళ అమ్మాయినీ మళ్ళీ వీళ్ళను ఎవరిబారినా పడకుండా, జాగ్రత్తగా అతని కుటుంబ సభ్యుల దగ్గరకు చేర్పించడం, ఇవన్నీ కూడా ఈ ఉదంతంలో మనం జాగ్రత్తగా గమనించాల్సిన అంశం. ఇంకొక వ్యక్తి గురించి చెబుతాను.

వీళ్ళ ఆశ్రమంలో చాలా మంది భగవాన్ చనిపోయాక, చాలా మంది చలంగారి ఆశ్రమంలో జరిగే భజన కార్యక్రమం లో పాల్గొనే వారని అనుకున్నాం కదా! అలాంటి వాళ్లలో ఒక వ్యక్తి వయసు 50, 60 సంవత్సరాల మధ్య ఉంటుంది. అందరూ దాదాజీ అని పిలిచేవారు. తెల్లటి అంగీ, తెల్లటి గడ్డం. పెద్ద మనిషి. అసలు పేరు “జతాలాల్”. అతను ఒక సింధీ వ్యక్తి. అప్పుడప్పుడు భోజనం కూడా వీళ్ళ ఇంట్లోనే చేస్తుండేవాడు. అక్కడే ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, ఉండేవాడు.

కొన్ని రోజుల తర్వాత ఆయన యొక్క నేపథ్యం చలం గారికి చెప్పాడు. అంతవరకూ కూడా అతను ఎవరో, ఎవరికీ తెలియదు. వస్తున్నాడు. ఏదో ఈ ఆధ్యాత్మిక భావనలో వున్నాడు. రమణ మహర్షి దగ్గరకు వెళ్ళేవాడు. ఇక్కడకు భజనలు వస్తున్నాడు అంతే. కొన్ని రోజుల తర్వాత చెప్పాడు “నేను ఇంట్లో చెప్పకుండా వచ్చేసాను. మా ఇంట్లో వాళ్ళకి నేను ఈ ఆధ్యాత్మిక భావాలతో ఉండడం ఇష్టం లేదు. నేను రమణ మహర్షి దగ్గర ఉండిపోదాము అని

వచ్చేశాను . అయితే, ఇంట్లో వాళ్ళు నా గురించి బాధ పడుతుంటారు. నేను ఇక్కడ వున్నాను అని తెలియకుండా, నేను క్షేమంగా ఉన్నట్లు వాళ్లకు తెలియాలి" అని చలం గారిని సహాయం అడిగాడు.

"సరే! ఎలాగూ?"అంటే... "నేను ఒక వుత్తరం రాస్తాను. కానీ, ఆ ఉత్తరం రమణ స్థాన్ నుండి వెళ్ళకూడదు. వేరే చోట నుండి వెళ్ళాలి. ఈ సహాయం చెయ్యండి."అన్నాడు. అప్పుడు చలం గారి మిత్రుడు పట్టాభి రామయ్య గారని, విజయవాడలో వున్నారు. ఆయనతో చిన్నప్పుడు చదువుకున్నాయన. చలం గారు ఏం చేశారంటే, ఈ దాదాజీ రాసినటు వంటి ఉత్తరాన్ని కవర్లో పెట్టి, పట్టాభిరామయ్య గారికి పంపించి, "మీరు ఫలానా అడ్రస్ కు పోస్ట్ చెయ్యండి. "అన్నారు. అలాగే అది వెళ్ళాక, ఆ దాదాజీ కుటుంబ సభ్యులు మళ్ళీ ఉత్తరం రాస్తే, అది పట్టాభి రామయ్య గారికి వస్తే, ఆయన మళ్ళీ అరుణాచలం పంపించడం ఇలా చేశారు.

అట్లా కొన్ని రోజులు అయ్యాక, మొత్తానికి ఎలాగైతేనేం ఆ దాదాజీ కుటుంబ సభ్యులకి దాదాజీ ఇక్కడ వున్నాడని తెలిసిపోయింది. వాళ్ళు అరుణాచలం వచ్చారు. వచ్చి, ఆయన కాళ్ళు పట్టుకొని బ్రతిమిలాడారు. "వెళ్ళిపోదాం రండి "అని. చలం గారికి చెప్పారు."మీరన్నా చెప్పండి . వెనక్కి తీసుకువెళ్ళిపోతాం. మాకు అన్నీ వున్నాయి. ఏమీ లేనట్లుగా ఇక్కడ ఉండడం ఎందుకు ?" అన్నారు. చలం గారు కూడా ఆయన్ని ఒప్పించిన మీదట, ఆయన వెళ్లిపోయారు. అంతటితో కథ అయిపోలేదు. వెనక్కి వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. బాగానే వుంది.

అయితే, ఇంతవరకూ మన కథలో 'మంగారాం' అని చెప్పుకున్నాం కదా! అతను ఒకసారి ఉత్తర భారతదేశం లోని, 'బరోడా' కి వెళ్ళాడు. అప్పుడు ఈ దాదాజీని కలిసాడు. ఆ దాదాజీ ఇంటికి వెళ్ళగానే, తీవ్రమైన దిగ్భ్రాంతి. ఎందుకంటే, దాదాజీ ఇల్లు మామూలు ఇల్లు కాదు. అత్యంత విలాసవంత మైనటు వంటి భవనం. విదేశీ కార్లు, విపరీతంగా ధనవంతులు. ఇంట్లో అన్నీ వదిలేసి, ఈ ఆశ్రమానికి వచ్చి,ఎవరికీ తెలియకుండా అలా వున్నాడన్నమాట.

మంగారాంను చూసి, దాదాజీ వాళ్ళూ, "బాగున్నారా?"అని అడిగారు. వాళ్ళు చేసేటటు వంటి వ్యాపారం ఏమిటంటే, అప్పడాలూ, సేమియా పేకెట్లూ ఇలాంటివి తయారుచేసి అమ్మడం. బరోడాలో ఈ వ్యాపారం చేసే అంత గడించారు. సరే! చలంగారి క్షేమ సమాచారాలు కనుక్కొని, మంగారాంతో "ఇదిగో నువ్వు వెళుతున్నావు కదా!"అని అప్పడాలూ, సేమియా పేకెట్లూ ఇచ్చి పంపించాడు. ఇంకా అయిపోలేదు ఈ కథ. ఆ తరువాత 5,6 నెలలకి ఆ 'జఠాలాల్'(దాదాజీ)మళ్ళీ అరుణా చలం వచ్చాడు. ఈసారి ఆయన పూర్తిగా కాషాయ దుస్తుల్లో వున్నాడు.

" మీరైతే ఆనాడు బ్రతిమిలాడి పంపించారు. నేనైతే ఆ సంసార బంధనాల్లో ఉండలేను. పూర్తిగా సన్యాసం తీసుకున్నాను.ఇక ఇంటికి వెళ్ళను. నేను గుళ్ళూ, గోపురాలూ తిరుగుతున్నాను. మీరెలా వున్నారు చలం గారూ? అప్పట్లో మీరు ఇబ్బందులు పడుతుండేవారు కదా!"

"నాకు బాగానే వుంది. పరవాలేదు. ఏవో ఇబ్బందులు ఉంటూనే ఉంటాయి. పోతూనేవుంటాయి."

"అలా కాదు. నేను మావాళ్లతో చెప్పి, మీకు నిధులు వచ్చేలా మీరు ఒప్పుకోండి."

"అలాంటిది ఏమీ వద్దు. మాకు ఎలా జరుగుతుంది అనేది భగవాన్ చూసుకుంటాడు. మీరు మాత్రం ఈ సన్యాసం లో ఉండగా, మళ్ళీ మీ వాళ్ళని సంప్రదించి, నాకోసం డబ్బులు తీసుకురావడం, అలాంటివి ఏమీ చేయవద్దు. "అన్నారు. ఆ తరువాత దాదాజీ వెళ్ళిపోయాడు. ఏమయ్యాడో తెలియదు.

మరో వ్యక్తి. చలంగారు 1972 ప్రాంతాల్లో, బెజవాడలో ఉండి, ఆ చుట్టుపక్కల ఊర్లలో ఉద్యోగాలు చేసేవారని చెప్పుకున్నాం కదా! ఆ రోజుల్లో ఒక కుర్రవాడు వచ్చి, చలం గారితో మాట్లాడి, "నేను అప్పుడప్పుడు వచ్చి, మిమ్మల్ని కలుస్తాను "అన్నాడు.

"సరే! రా! గానీ, వచ్చి ఏం చేస్తావు?" అన్నారు.

"ఏం లేదండీ. మీదగ్గర కూర్చుంటాను. అంతే. " అతని అసలు పేరు సుబ్రహ్మణ్యం. కానీ, మనిషి సన్నగా ఉంటాడని "సన్నాలు"అనేవారు.

" నా దగ్గర కూర్చుంటే, ఏం వస్తుంది?"

"ఏం లేదు. మిమ్మల్ని చూస్తూ కూర్చుంటే, ఎంతో మనశ్శాంతిగా ఉంటుంది."అన్నాడు. "నేనే అశాంతిలో కొట్టుకుంటున్నాను. నా ముందు కూర్చుంటే నీకు మనస్శాంతి రావడం ఏమిటి?"అన్నారు. గానీ, కాదనలేకపోయారు.

చలంగారు, క్రిష్ణానది వైపు పిల్లల్ని తీసుకొని షికారుకు వెళుతుండేవారు. అలా వెళుతున్నప్పుడు త్రోవలోనే ఉండేది ఈ సన్నాలు ఇల్లు. మధ్యలో ఆ కుర్రవాడు మజ్జిగలో, నిమ్మకాయ కలిపి ఇస్తూండేవాడు. ఒక రోజు సన్నాలూ, వాళ్ళ నాన్నగారూ, చలంగారిని అడిగారు. "మాఇంటికి భోజనానికి రండి" అన్నారు. వాళ్ళ మాట కాదనలేక, చలంగారూ, లీలగారూ వాళ్ళింటికి భోజనానికి వెళ్లారు. వెన్నెల్లో డాబా మీద భోజనం వడ్డించి, వాళ్ళందరూ చుట్టూ ఏదో అతి భక్తిగా,వీళ్ళు రావడం దైవ ప్రసాదం అన్నట్లుగా చూస్తున్నారు. వాళ్ళు వడ్డించింది మాంసం కూర. అంతా తిన్నాక, "ఎలా ఉందండి?" అని అడిగితే, "మాంసం సరిగ్గా ఉడకలేదు." అని మొహమాటం లేకుండా చెప్పారు.

ఆ తరువాత లీల గారు అడిగారు"వాళ్ళేదో మన మీద అభిమానంతో పిలిచారు. అలా ఎందుకు చెప్పారు?"

"అవును. మనసులో వున్నది చెప్పక పోతే, ఎలా తెలుస్తుంది?"అన్నారు. నిజానికి జరిగిందేమిటంటే, ఆ సన్నాలు అనే వాళ్ళు, వాళ్ళ ఇంట్లో ఎప్పుడూ మాంసం వండుకోలేదు. కేవలం చలంగారి కోసమని వండారు. అందుకని సరిగ్గా కుదరలేదు. ఆ తరువాత చలం గారు, బెజవాడ వచ్చినపుడల్లా, ఆ కుర్రాడు వస్తుండేవాడు. అతను ఎలక్ట్రిసిటి డిపార్ట్ మెంట్ లో పని చేసేవారు. ఒరిస్సా ట్రాన్స్ ఫర్ అయి వెళ్ళిపోయాడు. అతను మళ్ళీ బెజవాడ వచ్చేసరికి, చలంగారు అరుణా చలం వచ్చేసారు. అయినా, అరుణా చలం వచ్చి, "అయ్యో! మీరెందుకు ఇక్కడ వున్నారు. ఒరిస్సాలో నేను వున్న చోటుకి వచ్చేయండి. మీరందరూ వచ్చేయండి. మిమ్మల్ని నేను చూసుకుంటాను"అన్నాడు. దానికి చలం గారు "అలా రాలేము"అని చెప్పారు.

అతనికి చలం గారంటే ఎంత భక్తుంటే, వాళ్ళ అబ్బాయికి వసంత్ అనీ, అమ్మాయికి చిత్ర అనీ పేర్లు పెట్టుకున్నాడు. మరొక 20 సంవత్సరాలు ముందుకు జరిగితే... చలంగారు దాదాపు చివరి రోజులు. అనారోగ్యంతో ఉండగా ఈ సన్నాలు వచ్చాడు. "నేను పదవీ విరమణ కావించే ముందు నా భార్య మరణించింది. వసంత్ కూడా చనిపోయాడు. చిత్రకి కూడా పెళ్లి చేసేసి, మీ ఆశ్రమం లోనే వుంటాను." అన్నాడు గానీ, ఆ పనులన్నీ అయ్యే లోగానే, చలంగారు నిర్యాణం చెందడం, ఆ సన్నాలు మళ్ళీ రావడం అనేది జరగలేదు.

ఆ ఆశ్రమంలో జరిగిన ఇలాంటి ఉదాహరణలు 100 నుండి 150 వరకు చెప్పుకోవచ్చు. మనం కొన్ని మాత్రమే చెప్పుకున్నాం. చలంగారి వ్యక్తిగత జీవితం గురించిన విశేషాలూ, చలం గారి జీవితంలో అల్లుకున్న విశేషాలూ ఇంతటితో ముగిద్దాం. తరువాత భాగాల్లో చలం గారి సాహిత్యంలోని మరి కొన్ని అంశాలను చెప్పుకుందాం.

మరిన్ని వివరాలు తరువాత భాగంలో_ _ _.

★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 మే 21 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS